విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 26 జూన్ 2025 — 8 పేజీలు

పరామర్శల పేరుతో
కార్యకర్తలను చంపుతారా..?

- ఉనికి కోసమే జగన్ పరామర్శల యాత్రలు
- కార్యకర్తలు అంటే జగన్‌కు ప్రేమ లేదు
- జగన్ తీరుతో ప్రజలకు రక్షణ కరువు
- 2026 నాటికి 'వెలుగొండ' పూర్తి చేస్తాం
- మంత్రి నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర -ఒంగోలు : పరామర్శల పేరుతో జగన్ తన కార్యకర్తలను చంపుతూ రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఒంగోలులోని ఎన్టీఆర్ భవన్లో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ జగన్ పర్యటనలు కారణంగా రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కరువైందన్నారు. పొగాకు రైతుల పరామర్శ పేరుతో పొదిలి పట్టణంలో అమరావతి మహిళలను అవమానపరిచిన ఘటనను పురస్కరించుకొని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తెలుగు మహిళా నాయకుల పై, పోలీసులపై, ప్రజలపై వైసీపీ శ్రేణులపై దాడులకు దిగారు అన్నారు. అలాగే పల్నాడులో జగన్ మాటలు నమ్మి బెట్టింగులకు పాల్పడి, అప్పుడు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని ఏడాది తర్వాత పరామర్శించేందుకు జగన్ వెళ్ళాడన్నారు. అయితే భద్రత దృష్ట్యా పోలీసులు కేవలం 3 వాహనాలకు అనుమతి ఇచ్చి 100 మందితో పరామర్శ కార్యక్రమం చేపట్టాలని సూచించిన జగన్ తన బల ప్రదర్శనను కొనసాగించారన్నారు. వచ్చే వారికి గజ మాలలు, డీజే బాక్సు భారీ ర్యాలీలతో పనేందన్నారు. జగన్ ఉద్దేశపూర్వకంగానే భారీ ర్యాలీ నిర్వహించారు అన్నారు. జగన్ కాన్వాయ్ ఆ పార్టీకి చెందిన వ్యక్తిని గుద్దినా పట్టించుకోకుండా పక్కకి చెట్ల గుట్టలోకి లాగి ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా, గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తి చావు బతుకుల మధ్య ఉన్న వ్యక్తులను పరామర్శిస్తారని పేర్కొన్నారు. జగన్కు కార్యకర్తలు అన్నా కనీసం లేదన్నారు. గాయపడిన కార్యకర్తను పక్కకు లాగేసి తన బల ప్రదర్శన కొనసాగించారు అన్నారు. కనీసం 108 కూడా ఫోన్ చేయలేదని

మిగతా 7 లో ...

కాంగ్రెస్‌కు అధికారం అందించి
రాజ్యాంగాన్ని బతికిద్దాం

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

విశాలాంధ్ర - చీరాల : భారత రాజ్యాంగం బతకాలంటే కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అధికారంలోకి రావాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోనీ కార్యకర్తలు నాయకులతో విస్తృతస్థాయి సమావేశం పద్మశాలీయ కళ్యాణ మండపంలో నిర్వహించారు. జిల్లాలోని నియోజకవర్గాల నుండి వచ్చిన కార్యకర్తలు నాయకులతో మాట్లాడారు. మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా కావాలన్నా, పేదల జీవితాలు మారాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. మాజీ శాసన సభ్యులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమంచి కృష్ణ మోహన్, పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలాకి పార్టీ శ్రేణులు ముంత వారి సెంటర్ నుండి బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. పట్టణంలో ర్యాలీగా వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రాజీవ్ గాంధీ విగ్రహాలకు

మిగతా 7 లో ...

జిల్లా కోర్టు ఏర్పాటుకు
2.80 ఎకరాల భూమి సిద్ధం
2 లో..

నాటు సారా రహిత జిల్లాగా బాపట్ల

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : నాటు సారా రహిత జిల్లాగా బాపట్ల నిలిచిందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. నవోదయం 2.0 నాటు సారా నిర్మూలన కమిటీ జిల్లా స్థాయి సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. నాటు సారా ఉత్పత్తిని బాపట్ల జిల్లాలో పూర్తిగా అరికట్టామని జిల్లా కలెక్టర్ చెప్పారు.నవోదయం 2.0 కింద నాటు సారా నిర్మూలనపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.నవోదయం 2.0 ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు గడిచిన రెండు నెలల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి 5,240 లీటర్ల నాటు సారా ధ్వంసం చేశామన్నారు.జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గ్రామస్థాయి,మండల, డివిజన్,జిల్లా స్థాయిలో కమిటీలు నియమించామన్నారు.కమిటీలు సమర్థంగా పనిచేయడంతోనే 17 గ్రామాలలో నాటుసారా తయారుచేసే వ్యక్తులను గుర్తించామన్నారు. 42 కేసులు నమోదు చేశామన్నారు.34 మందికి పునరావాస కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు.64 మందిని బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ చేసిన వారిని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారులు దత్తత తీసుకున్నారన్నారు. వారిలో సత్ప్రవర్తన వచ్చేవరకు నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో నాటు సారాను పూర్తిగా అరికట్టడంపై అధికారులను

మిగతా 7 లో ...

జర్నలిస్టులకు ఇంటి స్థలాలతో పాటు
ఇళ్లు కట్టిస్తాం

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల హామీ
- రెండవ రోజు కొనసాగిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు నగరంలోని విష్ణుప్రియా ఫంక్షన్ హల్ నందు ఎపియుడబ్ల్యుజె 36వ మహాసభలు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా సభలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వచ్చాం. గతంలో టిడిపి అధికారంలో ఉన్న ప్రతిసారి రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని జర్నలిస్టులకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాం అని తెలిపారు. 2014లో నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఒంగోలులో ఇళ్ల స్థలాలు లేని జర్నలిస్టులకు కొప్పోలు వద్ద ఇళ్ల స్థలాలు ఇచ్చాను అని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో జర్నలిస్టులందరికీ ప్రభుత్వం అక్రిడేషన్లు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమాన్ని పట్టించుకున్న పరిస్థితి లేదు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే అక్రిడేషన్ కార్డుకి కూడా వైసీపీ ప్రభుత్వంలో కోత పెట్టారు. జర్నలిస్ట్ యూనియన్లు అక్కడ రేషన్ కార్డులు ఇవ్వాలని ఎన్నిసార్లు జగన్ అడిగినా పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రజా సమస్యలపై నిత్యం వార్తలు ప్రసారం చేసే ఏబీఎన్, టీవీ5, ఈటీవీ, మహా టీవీ వంటి చానల్స్‌ని ఏపీలో ప్రసారాలు కూడా నిలిపివేశారు అన్ని తెలిపారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని రంగాలతో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఒంగోలులో కూడా మరోసారి ఇల్లు లేని జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు నేను ఇప్పటికే జర్నలిస్ట్‌కి హామీ ఇచ్చాను. ఒంగోలులో ఇప్పటివరకు ప్రెస్ క్లబ్ లేదు. దీనికి కూడా స్థలం కేటాయించి భవన నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చాను. దీంతో పాటు అర్హులైన అందరికీ అక్రిడేషన్ కార్డులు ఇస్తాం అన్ని తెలియజేసారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి — 3 లో..

బడి ఈడు పిల్లలు నూరుశాతం బడిలోనే ఉండాలి — 5 లో..

అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రలు

విశాలాంధ్ర – బాపట్ల : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాపట్ల మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మండలంలోని మున్సిపాలిటీలో 133 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు,వంట పాత్రలు,ప్రీ స్కూల్ బుక్స్‌ని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ప్రభుత్వం సరఫరా చేయబడిన ఈ వస్తువులన్నిటిని ఇప్పటి నుండి అంగన్వాడీ కేంద్రాల్లో ఉపయోగిస్తూ వారి బాధ్యతను స్వీకరిస్తూ అంగన్వాడీ కేంద్ర పనితీరులను మెరుగుపరచాలని ఎమ్మెల్యే తెలిపారు.

ఎంపీ మాగుంటను కలిసిన టీడీపీ నేత కొప్పుల సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఒంగోలు ఎంపీ మాగుంటను కలిసిన దోర్నాల మండల టీడీపీ నాయకుడు కొప్పుల వెంకట సుబ్బారెడ్డి. బుధవారం ఒంగోలు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. వై. పాలెం ఇంచార్జ్ గూడూరి ఏరిక్షన్ బాబు ఆదేశాల మేరకు గంటవానిపల్లె గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం విషయంపై అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యలపై అడిగారు. సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని తెలిపారు.

వెదుళ్లపల్లిలో ఫేస్ వాష్ అండ్ గో

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్సై భాగ్యరాజ్ ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర – బాపట్ల : హైవేలపై రోడ్డు ప్రమాదాలను నివారించే చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు వెదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు అర్ధరాత్రులు వాహనదారులకు ఫేస్ వాష్ అండ్ గో అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాహనాలు ఆపి డ్రైవర్లు నీటితో ముఖం కడుకున్న వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నిద్రమత్తు వదులుతుందని ప్రమాదాలు నివారణకు దోహదపడుతుందని ఎస్సై తెలిపారు. డ్రైవింగ్ చేసేటప్పుడు తమను తాము జాగ్రత్తగా చూసుకోవాలని వారి కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలని ప్రమాదాలను నివారించాలని కోరుతూ పోలీసులు డ్రైవర్లకు సూచనలు చేశారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. ఇంటి దగ్గర కుటుంబీకులు మన కోసం ఎదురు చూస్తు ఉంటారనే విషయం ప్రతి డ్రైవర్ గుర్తించుకోవాలని సూచించారు. పరిమిత వేగంతో వాహనం నడపటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు.

నర్సరీల యాజమానులు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : నర్సరీల యజమానులు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి వై.గోపిచంద్ అన్నారు. బుధవారం యర్రగొండపాలెం లోని ఎంపిడివో కార్యాలయంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో షేడ్ నెట్ నర్సరీ యజమానులకు నాణ్యమైన నారు పెంపకం గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల యజమానులు అందరూ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, లేనిచో వారి మీద చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో తీసుకున్న లైసెన్స్ లు మార్చి నెలతో గడువు ముగిసింది కాబట్టి అందరు మళ్ళీ పునరుద్ధరణ చేసుకోవాలని సూచించారు. అధీకృత డీలర్ల వద్ద మంచి నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొని పెంచాలని, ఆ బిల్లులు తరుచుగా తనిఖీ చేస్తామని తెలిపారు.

నకిలీ విత్తనాలు పెంచే నర్సరీ యజమానుల మీద తీవ్ర చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కూడా నారు కొనేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని కోరారు. ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఎమ్. రవీంద్రబాబు మాట్లాడుతూ రైతులు మంచి నాణ్యమైన కోకోపీట్ వాడాలని లేనిచో నారు పెరుగుదల సరిగా ఉండదని అన్నారు. కోకోపీట్ లో ట్రైకోడెర్మా విరిడి వంటి శిలీంధ్ర నాశిని, జీవన ఎరువులు కలిపి ట్రేలలో నింపి విత్తు కుంటే నారు కుళ్ళు సమస్య రాదని తెలిపారు. షేడ్ నెట్ ఎక్కడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలి లేదంటే దోమ ఆశించే అవకాశం ఉంటుందని తెలిపారు. నారు పెరుగుదల సమయంలో రెండు నుంచి మూడు సార్లు 19:19:19, సూక్ష్మ పోషకాలు పిచికారి చేయాలని తెలిపారు. రైతులు నారు పెంపకం లో అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఉద్యాన శాఖ అధికారి ఆదిరెడ్డి మాట్లాడుతూ నర్సరీల యజమానులు అందరూ త్వరగా లైసెన్సులు తీసుకోవాలని కోరారు. గ్రామ ఉద్యాన సహాయకులకు ప్రస్తుతం ఉన్న రాయితీ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఉద్యాన శాఖ అధికారి రమేష్, మార్కాపురం పరిధిలోని గ్రామ ఉద్యాన సహాయకులు, యర్రగొండపాలెం పరిధిలోని ఐదు మండలాల నర్సరీ యజమానులు, ఐదు మండలాల గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఏర్పాటుకు 2.80 ఎకరాల భూమి సిద్ధం

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర – బాపట్ల : జిల్లా కోర్టు భవన సముదాయానికి అవసరమైన 2.80 ఎకరాల భూమి సిద్ధంగా ఉంచామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రాజధాని అమరావతి నుంచి సిసిఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు.జిల్లా కేంద్రమైన బాపట్ల పట్టణంలో జిల్లా కోర్టు భవన సముదాయానికి కావలసిన భూమి సిద్ధంగా ఉంచినట్లు జిల్లా కలెక్టర్ సిసిఎల్ఏ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు.కోర్టు నిర్మాణానికి పది ఎకరాల భూమి కావాలని న్యాయమూర్తి కోరినట్లు చెప్పారు.అందుబాటులో ఉన్న 2.80 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదేనన్నారు.భూమికి సంబంధించిన దస్త్రాన్ని సంబంధిత న్యాయమూర్తికి పంపుతామని చెప్పారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాల అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బాపట్ల జిల్లాలో 7,602 సి సి ఆర్ సి కార్డులు రైతులకు ఇచ్చామన్నారు.జిల్లా కోర్టుల నిర్మాణానికి అవసరమైన భూమిని న్యాయశాఖకు కేటాయించాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. వాటికి సంబంధించిన దస్త్రాలను తక్షణమే న్యాయశాఖకు బదలాయింపు చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీలపై ఆడిట్ నిర్వహించాలన్నారు. జాతీయ రహదారులకు భూ సేకరణ వేగంగా పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,ఆర్డీఓ పి.గ్లోరియా,ఉప కలెక్టర్ లవన్న,సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి కనకరాజు,వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల శుద్ధిపై రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర – కొల్లూరు : వరి పంటలో విత్తన శుద్ధి,వరి నారు పెంచుట విధానంపై రైతులకు అవగాహన కల్పించినట్లు కొల్లూరు మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు తెలిపారు.బుధవారం చిన్నపులివర్రులో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఏఓ రైతులతో మాట్లాడుతూ వరి పంటలో విత్తన శుద్ధి చేయడం వలన నేల ద్వారా,విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ల నుండి పంటను రక్షించవచ్చు అని రైతులకు తెలియజేశారు.కిలో వరి విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి అని తెలియజేశారు.నారు మడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి చదును చేయాలి నీరు పెట్టటానికి తీయడానికి వీలుగా కాలువను ఏర్పాటు చేయాలన్నారు.ఐదు సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (1 కిలో విత్తనం చల్లే ముందు వరిలో విత్తిన 12-14 రోజులకు),1 కిలో భాస్వరం, 1 కిలో పటాస్ నిచ్చే ఎరువులను దుక్కులో వేయాలన్నారు.చలి ఎక్కువగా ఉండే ప్రాంతంలో భాస్వరం రెట్టింపు వేయాలన్నారు.మొలకలు కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోలు చొప్పున చల్లుకోవాలన్నారు.కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులను అందించారు.ఈ కార్యక్రమమునకు సర్పంచ్ శ్రీలామ్ శివ రత్నకుమారి,వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రభాకర్‌రావు,వంశీ,కె.విజయ్ కుమార్,రాంబాబు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర – జె.పంగులూరు : వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరని ఎస్సై వినోద్ బాబు అన్నారు.జె.పంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్యాపురం రోడ్లో ఎస్సై వాహనదారులను తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు భద్రతా సూచనలు,హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు పద్ధతి వ్యాపారమైన సూచనలను తీసుకొని నడపవలసిందిగా కోరారు.ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని,వాహనదారులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఫోర్ వీల్,ఆటో డ్రైవర్లు ఎక్కువమంది ప్రయాణికులతో డ్రైవింగ్ చేయరాదని పరిమితి మించి ప్రయాణికులతో అతివేగముగా ప్రయాణము చేయరాదన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కోలలపూడి విద్యార్థులు

విశాలాంధ్ర – మార్టూరు : మార్టూరు మండలం కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిబుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు.గాలి శ్రీనాగ తేజ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి కళాశాలలో,వల్లెపు బాల మణికంఠ ఒంగోలులోని ట్రిపుల్ ఐటి కళాశాలలో ప్రవేశాలు పొందినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.తమ గ్రామం నుండి ట్రిపుల్ ఐటి కళాశాలలో సీట్లు సాధించిన ఇరువురు విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు,గ్రామ సర్పంచ్ ఎం.సతీష్ కుమార్,జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందిమళ్ళ రామకోటేశ్వరరావు తదితరులు అభినందించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : సీపీఐ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్నాయి. ఈ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పూల సుబ్బయ్య పేరు ప్రకాశం జిల్లాలో ఒక ప్రేరణ. నీటి కొరకు, రైతుల కొరకు, కార్మికుల హక్కుల కొరకు, ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం కొరకు ఆయన నడిపిన పోరాటాలు ప్రజల స్మృతి పథంలో నేటికి మసకబారలేదు. పేద ప్రజల కొరకు ఆయన చేసిన త్యాగానికి ప్రతీకగా పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ రూపంలో అమరమైంది అన్నారు. కళా సాంస్కృతిక రంగాలలో కూడా ప్రకాశం జిల్లా వన్నెకెక్కింది. ఆశయాలను ముందుకు తీసుకుపోవడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో జరుగుతున్నాయి. ఈ మహదాశయం నెరవేరాలంటే ప్రజల అండ దండలు కావాలన్నారు. నేడున్న పరిస్థితుల్లో భారత కమ్యూనిస్టుపార్టీ ని బలోపేతం చేయాల్సిన కర్తవ్యం తాడిత, పీడిత, ప్రజానీకంపైన, కార్మిక వర్గంపై ఉన్నదన్నారు. ప్రజావ్యతిరేక విధానాల అమలుకు పూనుకుంటున్నాయి. దశాబ్ద కాలంగా దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోడీ, అయన పార్టీ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ ఆస్తులన్నిటిని అదానీ, అంబానీలకు ధారాళంగా అమ్మి వేస్తున్నారు. పాలనంటే కార్పొరేట్లకు ఊడిగం చేయడమేనని నమ్మే స్థాయికి ప్రజలను నెట్టి వేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి మన్నె సాంబశివరావు, నక్కా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది పొగాకు..వద్దు

విశాలాంధ్ర - యద్దనపూడి : రైతులు ఈ ఏడాది పొగాకు సాగు వైపు మొగ్గుచూపు వద్దని వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌విపి కుమారి అన్నారు. మండలంలోని చిమటావారిపాలెం, వింజనంపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీల సిబ్బంది వచ్చి చెప్పే మాటలు నమ్మి పొగాకు సాగు చేయవద్దన్నారు.పొగాకుకు ప్రత్యామ్నాయంగా ప్రత్తి,కంది,శనగ, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవాలిని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుదర్శని,లీలా సత్య రైతులు వీరశంకరరావు, సాదినేని సుధీర్, సాదినేని రంగారావు,రైతులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

విశాలాంధ్ర - కొల్లూరు : ప్రజలందరూ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కొల్లూరు, దోనేపూడి సెక్టార్ల ఐసిడిఎస్ సూపర్వైజర్లు రజని, ఫజరున్నీసా అన్నారు.బుధవారం కొల్లూరు, దోనేపూడి హైస్కూల్ ఆవరణలో మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్వైజర్లు మాట్లాడుతూ ఆరోగ్యానికి హానికరమైన ఏదైనా మత్తు పదార్థం వాడకూడదన్నారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే విధంగా అంగన్వాడీలు కృషి చేయాలన్నారు. మత్తు వ్యసనానికి సంబంధించిన ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఆదిలక్ష్మి, నీరజ,వనజ, అపర్ణ,అరుణ, సౌభాగ్య లక్ష్మి,బసవపూర్ణ, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై తనిఖీలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండల పరిషత్ అభివృద్ధి అధికారి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో డిప్యూటీ ఎంపీడీవో శివరామకృష్ణ ప్రసాద్ ఏల్చూరులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులపై బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని కార్యదర్శులు ఉదయాన్నే ఏడు గంటలకల్లా గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించాలని ఆదేశించారు. అలాగే గ్రీన్ అంబాసిడర్లతో ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్తను డంపింగ్ యార్డులకు తరలించే విధంగా వారికి సూచనలు చేయాలని చెప్పారు. అంతేకాకుండా సైడు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి, పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. దీంతో పాటు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి,వాటిని ఆన్లైన్లో నమోదు,ఎక్కడైనా పైపులకు లీకేజీలు ఉన్నట్లయితే, మరమ్మత్తులు చేయడం వంటివి రోజువారీ దినచర్యగా చేపట్టాలని తెలిపారు.

రైతులకు సబ్సిడీపై అవగాహన

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని రావులకొల్లు మరియు ఉప్పలదిన్నె గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వి.రాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళ, బుధ వారాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు శాస్త్రవేత్తలు అందరూ ఒకే వేదిక మీదకు వచ్చి రైతులకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, అవగాహన కల్పించి మరియు సాంకేతిక సమాచారం అందించి, క్షేత్ర స్థాయిలో తక్షణం పరిష్కారం సూచించడమే దీని యొక్క ఉద్దేశం అని తెలియజేసారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ నుండి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు జనములు 80 క్వింటాలు అందుబాటులొ ఉన్నాయని పూర్తి ఖరీదు కేజీ రూ 109.00, రైతు కట్టవలసినది 50శాతం రాయితీతో రూ 54.50 అని, కావలసిన రైతులు మీ సంబంధిత రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లించి తీసుకోవచ్చని తెలియజేసారు.పచ్చిరొట్టఎరువులైన జనుము, జీలుగ మరియు పిల్లిపేసర వేసుకొని, పూత సమయంలో భూమిలో కలియదున్నడం వలన భూసారం వృద్ధి చెంది, కర్బన శాతం పెరిగి భూమి గుల్ల బారి, నీటిని పిలుచుకొనే గునం పెరుగుతుందని, పైర్లు ఆరోగ్యంగా పెరిగి అధిక దిగబడి పొందవచ్చునని తెలిపారు.పంట సాగు చేసే ప్రతి ఒక్క కౌలు రైతు తప్పనిసరిగా మీ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి, మీ ఆదార్ కార్డు,భూయజమాని పట్టాదారు పాసు పుస్తకం, ఎంత విస్తీర్ణంలో ఏమి పంట వేస్తారో తెలియజేసి కౌలు ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునని తెలిపారు, తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ నుండి విత్తనాలు, ఎరువులు, పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, బ్యాంకు లో రుణాలు మరియు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు లబ్ది పొందవచ్చునని తెలియజేసారు.పై కార్యక్రమంలో రావులకొల్లు, ఉప్పులదిన్నె గ్రామ వ్యవసాయ సహాయకులు వై.మాధవ రావు,వ్యవసాయ విస్తరణాధికారి ఇ.సుధీర్,రెండు గ్రామాల పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.

గొట్లగట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా బాలయ్య

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్లగట్టులో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ సిగినం పెద్ద బాలయ్య ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన కొనకనమిట్ల ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ వైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ పృథ్వీరాజ్ పి జి కోర్సులకు నిమిత్తం వెళ్లారు.

కౌలు కార్డులపై అవగాహన

విశాలాంధ్ర-పీసీపల్లి : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కౌలు కార్డుల జారీపై బుధవారం మండల వ్యవసాయ అధికారి రంగాకృష్ణ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ ఉష మాట్లాడుతూ సీసీఆర్సీ చట్టం ప్రకారం మండలంలోని ప్రతి కౌలు రైతుకు తప్పనిసరిగా కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్డు పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని దీని మీద కౌలుదారులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందన్నారు. భూమి మీద హక్కు ఉండదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు అందించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బందికి తెలియజేశారు కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి 'పొలం పిలుస్తోంది'

మండల వ్యవసాయ అధికారి రంగాకృష్ణ

విశాలాంధ్ర-పిసీపల్లి : రైతుల సమస్యలను తీర్చడానికే పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రంగాకృష్ణ తెలియజేశారు. బుధవారం మండలంలో నేరేడుపల్లి మురుగమ్మి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్టెరువులైన జనుములు జిలుగలు ముందుగా పొలాల్లో చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అఖిల్ సాయి ప్రియ నేరేడుపల్లి సర్పంచ్ పళ్ళ మల్లికార్జున రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేటేరు జెడ్పి హైస్కూల్‌లో ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు హైస్కూల్ హెచ్ ఎం.బాపూజీ తెలిపారు. వి.షణ్ముఖ దుర్గారామ్ త్రిబుల్ ఐటీ ఒంగోలు,కాగిత సుధీర్ త్రిబుల్ ఐటీ ఒంగోలు, జి.పూర్ణ సుధీర్ కుమార్ త్రిబుల్ ఐటీ నూజివీడు కాలేజీలలో సీట్లు పొందినట్లు హెచ్‌ఎం తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా జడ్పీ హైస్కూలు పేటేరు విద్యార్థులు త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించడం పట్ల హైస్కూల్ ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు, కూటమి నాయకులు విద్యార్థులను అభినందించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - పర్చూరు : జాతీయ రహదారి నిర్మాణంలో ఎదురైన సమస్యను పరిష్కరించకుండా పంటలు వేసే సమయం వస్తున్ననూ జాతీయ రహదారి గుత్తేదారు కాలయాపన చేస్తున్నారని బుధవారం మండలంలోని తిమ్మరాజుపాలెం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. పనులు చేయకుండా అడ్డగించడంతో లారీలు రోడ్డుపై ఉన్నాయి. వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు నిర్మాణంలో రైతులకు ఉన్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తేనే రైతులకు మేలు జరుగుతుందని, పంట పొలాలు వరదనీటికి ముప్పు గురికాకుండా ఉంటాయని, వాటిని పరిష్కరించే వరకు పనులను నిలుపుదల చేయాలని రైతులు తెలిపారు.

అలవలపాడులో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని అలవలపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాలలోని పంట పొలాల వద్ద,రైతుసేవా కేంద్రాల వద్ద మండల వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి బుధవారం పొలం పిలుస్తుంది, గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు కంపెనీల నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా సాగు చేయవద్దన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా పొగాకు పంటకు బదులు జొన్నలు, మొక్కజొన్న, పప్పుధాన్యాల పంటలు సాగుచేసు కోవలసిందిగా తెలిపిందని, పచ్చిరొట్ట గింజలు సాగుచేసి భూమిలో కలియదున్నుటవలన భూసారము పెరుగునని తెలిపారు. ప్రకృతి వ్యవ సాయము పద్ధతులు పాటించి పంటలు పండించుటవలన పురుగుమందులు అవశేషములేని పంట ఉత్పత్తులు పొంది ఆరోగ్యముగా ఉండవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు,రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ ఇంటి వద్దనే పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని చౌక ధరల దుకాణానికి సంబంధించిన డీలర్లు వారి పరిధిలోగల 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు, మంచంలో ఉన్న కార్డుదారులకు ఇంటి వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయవలసినదిగా తహశీల్దార్ పి.సింగరావు డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమం గురువారం నుంచి ఈ నెల 30 వరకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జూలై మాసానికి రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయవలెనని ఆదేశించారు. మండలంలోని వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్దనే ఉండి డీలర్లకు సహరించి మీ సరుకులు తీసుకోవలసినదిగా కోరారు.

దేశానికి ఎమర్జెన్సీ చీకటి రోజు

విశాలాంధ్ర -చీరాల రూరల్ : భారత దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా చీరాలలో ఎమర్జెన్సీ కాలంలో అరెస్టయి జైలు పాలైన బిట్రా మంగయ్యని భాజపా నాయకులు ఘనంగా సన్మానించారు. బాపట్ల పార్లమెంటు సమన్వయకర్త బండారుపల్లి హేమంత్ కుమార్ మాట్లాడుతూ భారత దేశంలో ఎమర్జెన్సీ రోజులు చీకటి రోజులు అన్నారు.ఇందుకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిన ప్రజా ఉద్యమంతో ఎమర్జెన్సీ ఎత్తివేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మువ్వల వెంకటరమణారావుకారర్ల వెంకటేశ్వరరావు, చీరాల పట్టణ అధ్యక్షురాలు గుద్దంటి భవాని,తదవర్తి చంద్రశేఖర్,శంకర శెట్టి నాగేశ్వరరావు,పింజల భరణిరావు,రామస్వామి రెడ్డి,గోలి సాయిరామ్, గంజి లక్ష్మయ్య,గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఇంటర్ విద్యార్థులకు నీట్, ఐఐటి శిక్షణ హర్షణీయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

విశాలాంధ్ర - రేపల్లె : మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజెపి) గురుకులాల్లోని ఇంటర్ విద్యార్థులకు నీట్,ఐఐటి శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో రెండు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ప్రకటించడాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం హర్షిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు హర్ష వ్యక్తం చేశారు. బుధవారం ఇసుకపల్లి శారద ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా అభివృద్ధి చేస్తూ, జూనియర్ కాలేజీలుగా ఉన్నతీకరించాలంటూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, సంబంధిత శాఖ మంత్రి సవితకు విజ్ఞాపన పత్రాల నందించామన్నారు. మా విజ్ఞాపనలనుమన్నించి, ఎం.జె.పి. గురుకులాలలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్,ఆర్ట్,క్రాఫ్ట్,సంగీత ఉపాధ్యాయులకు టీజీటీ స్కేల్ వర్తింపజేస్తున్నందుకు ధన్యవాదాలన్నారు.ఎక్కువమంది విద్యార్థులు ఉన్నచోట రెండు పిఈటీలను నియమించాలని, దగ్గరలో ఉన్న ప్రతి రెండు బీసీ వసతి గృహాలను కలిపి,జూనియర్ కళాశాలగా తీర్చి దిద్దాలని కోరుతున్నామన్నారు.గత మా విజ్ఞాపనలో కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న 715 మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరామని. ఆ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలని శంకరరావు విజ్ఞప్తి చేశారు.సమావేశంలో బిసి సంఘ నాయకులు సిహెచ్. నాగమల్లేశ్వరరావు, ఐదుగు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - పర్చూరు : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సిడిపిఓ జి.సుభద్ర తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రత గతతో విద్యను కొనసాగించాలని, మత్తుపదార్ధాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యాభివృద్ధిలో లక్ష్యాలను చేరుకొని విద్యాసంస్థలకు, సమాజానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో హోమియో వైద్యులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కలిగించారు. పంచాయితీ, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. విద్యార్థులు చేత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేష కుమారి, సూపర్వైజర్ దీపాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

ఉచితంగా నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ

విశాలాంధ్ర - జె.పంగులూరు : జె.పంగులూరు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మండల తహసీల్దార్ పోపూరి సింగారావు చేతులమీదుగా రాత పుస్తకాలు పెన్నులు పెన్సిళ్లు పలకలు ఉచితంగా పంపిణీ చేశారు. బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం జె.పంగులూరు మండల శాఖ వారి ఆర్థిక సహకారంతో గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) క్యాంపస్‌లో ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రం, అంగనవాడి కేంద్రాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, ఎరేజర్లు ఉచితంగా అందించారు. మండల రెవెన్యూ అధికారి పోపూరి సింగారావు విశ్వబ్రాహ్మణ సంఘంని అభినందించారు. దాతల సహకారాలను, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు నాగభూషణం, గోగుల వీరాంజనేయులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు రవిచంద్ర, పి.సాంబశివరావు, కె.మల్లిఖార్జునచారి, కె.సురేష్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురి విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె ఓల్డ్ టౌన్ మూడో వార్డులో గల మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు హైస్కూల్ హెచ్ఎం చిలక సుందరరావు తెలిపారు.ఎన్.తేజస్విని నూజివీడు, లీలా భరత్ కుమార్ నూజివీడు,కే.మారుతీ రాఘవ నూజివీడు, బి.సల్మా ఒంగోలు,మధుమిత నూజివీడు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు హెచ్ఎం తెలిపారు. ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను రేపల్లె ఎమ్మెల్యే, రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ అనగాని సత్యప్రసాద్,టిడిపి నాయకుడు శివప్రసాద్, మున్సిపల్ చైర్మన్ కట్ట మంగ సుబ్బారావు,వైస్ చైర్మన్లు ప్రశాంత్ కుమార్, విశ్వనాథ గుప్తా,మూడవ వార్డు కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కే.సాంబశివరావు, హై స్కూల్ హెచ్ఎం,ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, టీ.పుల్లారావు, శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జి.నాంచారయ్య, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ప్రతినిధులు తదితరులు విద్యార్థులను అభినందించారు.

పంటల బీమాతో రైతన్నకు ధీమా

విశాలాంధ్ర -చీరాల రూరల్ : 2025వ సంవత్సరం ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు ప్రభుత్వం పంటల భీమా పథకాన్ని అమలు చేస్తున్నదని చీరాల మండల వ్యవసాయ అధికారి పి.నిర్మలాదేవి తెలిపారు.మండలంలోని బుర్లవారిపాలెం,పిట్టువారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని వరి,మినుము, కంది, మొక్కజొన్న,మిరప పంటలను ప్రభుత్వం నోటిఫైడ్ పంటలుగా గుర్తించిందన్నారు. పంటలు సాగు చేసే రైతులందరూ పంటల భీమాను పొందడానికి వరి కోసం ఆగష్టు 15వ తేదీ, మిగిలిన పంటలకు జులై 31వ తేదీ వరకు ప్రీమియం చెల్లింపు చేయవచ్చునని తెలిపారు. రైతులందరూ పంటల భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుండి ఆర్థిక సాయం పొందవచ్చునన్నారు. వెటర్నరీ సహాయకులు స్వాతి మాట్లాడుతూ పశు వులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు శ్రావ్య, పావని,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ల సాంబశివరావు ఇంటిపై పోలీసుల సోదాలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు విచారణ వేగవంతంగా సాగుతోంది. సదరు కేసు విచారణ అధికారి ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు , నాగులప్పల పాడు ఎస్సై రజియా సుల్తాన్, సంతనూతలపాడు ఎస్ఐ అజయ్ కుమార్ , వారి సిబ్బంది కలసి అమ్మనబ్రోలులోని ఆళ్ల సాంబశివరావు ఇంటిలో సోదాలు నిర్వహించారు. సాంబశివరావు ఇంట్లో ముద్దాయిలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు, చెక్కులు, ప్రామిసరీ నోట్లు, కీలకమైన పత్రాలు, ఖాతాల పత్రాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, రికార్డింగ్స్ వంటి పలు అంశాలను అధికారులు పరిశీలించారు. ఇంకా కేసుకు సంబంధించి మరిన్ని ఆధారాలు, నిందితుల సంబంధాలు వెలుగులోకి తీసుకురావడంపై పోలీసులు దృష్టి సారించారు. ముప్పా సురేష్ ఇంటి వద్ద వారి కుటుంబ సభ్యులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జగన్‌ను కలిసిన కదిరి బాబురావు

విశాలాంధ్ర-సిఎస్ పురం : మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబు రావు కలిశారు. తాడేపల్లి లోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర పార్టీ విస్తృతస్థాయి సమావేశం పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. టీడీపీ కూటమి ఏడాది పాలన వైఫల్యాలతో పాటు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎగ్గొట్టిన వైనం ప్రతిపక్ష వైయస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా సాగుతున్న కుట్రలు, దాడులపై సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ప్రభుత్వం సూపర్‌సిక్స్, సూపర్‌సెవెన్ హామీలు ఎగ్గొట్టిన తీరును ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండ గట్టాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

పీజీఆర్ఎస్ అర్జీలు పరిశీలన

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రకాశం జిల్లా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా పంచాయతీరాజ్ అధికారి పి.జి.ఆర్.ఎస్ నందు నమోదైన అర్జీలను గురించి బుధవారం చీమకుర్తి మండలంలోని ఎర్రగుడిపాడు, జివిఎల్ పురం, గ్రామపంచాయతీలను విజిట్ చేసి వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగింది. గతంలో వీరు పి జి ఆర్ ఎస్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.

బడి ఈడు పిల్లలు నూరుశాతం బడిలోనే ఉండాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : బడి ఈడు పిల్లలు నూటికి నూరు శాతం బడిలోనే వుండాలని, అందుకనుగుణంగా స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్ పై మండల విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మండల విద్యా శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మండల విద్యా శాఖాదికారులతో సమావేశమై స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్, టీచర్స్, స్టూడెంట్స్ అటెండెన్స్, స్కూల్స్ నందు మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో అనేక సంస్కరణలు తీసుకు రావడం జరిగిందన్నారు. జిల్లాలో బడి ఈడు పిల్లలు నూటికి నూరు శాతం బడిలోనే వుండాలని, అందుకనుగుణంగా స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్ పై మండల విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా నాణ్యమైన విద్యనూ అందించేలా కృషి చేయాలన్నారు. ప్రతి స్కూల్ నందు ఒక టీచర్ ను నోడల అధికారిగా నియమించి ఆ స్కూల్ నందు ఉన్న వల్నరబుల్ విద్యార్థులను గుర్తించి వారికి సంబంధించి సమగ్ర వివరాలతో జాబితాను రూపొందించేలా మండల విద్యా శాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియ కచితంగా ప్రతి స్కూల్ నందు జరగాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు. మండల విద్యా శాఖాధికారులు తమ మండల పరిధిలోని స్కూల్స్ ను సందర్శిస్తూ, విద్యార్థులతో ఇంటరాక్ట్ అవుతూ స్కూల్ లో విద్య ను ఎలా బోధిస్తున్నారు. పాఠ్యాంశాలు అర్థమౌతున్నాయా, టీచర్స్ వలన ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. టీచర్ వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే సంబంధిత టీచర్ పై కచితంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి స్కూల్ నందు పిర్యాదుల బాక్స్ ను ఏర్పాటు చేయడంతో పాటు, పిర్యాదు బాక్స్ ఏర్పాటు ఉద్దేశ్యంను ప్రతి విద్యార్థికి తెలిసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మండల విద్యా శాఖాధికారులను ఆదేశించారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ 1వ తరగతి నందు చేర్పించడం, దిగువతరగతి నుండి ఎగువ తరగతికి ప్రమోషన్ చేయడం, డ్రాప్ అవుట్ అయి బడిమానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించడం తదితర విషయాలపై మండల విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్, మండల విద్యా శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నివేశన స్థలాల దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి శ్రీమతి జయలక్ష్మి జిల్లా కలెక్టర్లకు సూచించారు. బుధవారం ఉదయం విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, వర్చువల్‌గా అన్ని జిల్లాల కలెక్టర్ల తో సమావేశమై పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తుల పెండేన్సి, ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపు, రీ సర్వే పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీమతి జయలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాల్లో ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్దిదారుల వివరాలను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటిపట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నివేశన స్థలాల కేటాయింపునకు సంబంధించి అందుబాటులో ఉన్న స్థలాల వివరాల డేటాను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా ల్లో జరుగుచున్న రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో నాణ్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వర కుమార్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా, ల్యాండ్ సెక్షన్ సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని వెనుక నుంచి కారు ఢీకొట్టిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఈ ప్రమాదంలో యువకుడి తలకు బలమైన గాయాలయ్యాయి. అందిన సమాచారం ప్రకారం వల్లెపు రవితేజ కుటుంబం సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నారు. రవితేజ బల్లికురవ మండలం రామాంజనేయపురం వద్ద ఓ అట్టల పరిశ్రమలో పని చేస్తున్నారు. రోజూ తన బైకుపై వచ్చి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో వెనుకగా కారు వచ్చి యువకుడు ప్రయాణిస్తున్న బైకును ఢీకొనడంతో కిందపడిపోయాడు. తలకు బలమైన గాయాలైనట్లు బంధువులు చెప్పారు. స్థానికులు స్పందించి అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రుడిని వైద్యం కోసం నరసరావు పేటలోని పలు ఆస్పత్రులకు తరలించారు. రవితేజ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు అక్కడికి తరలించారు. ప్రస్తుతం రవితేజ శరీరం వైద్యానికి సహకరించడం లేదని, కోమాలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేద్దాం

విశాలాంధ్ర - మార్టూరు : రైతులు పొగాకు సాగును గణనీయంగా తగ్గించి లాభదాయకంగా ఉండే ప్రత్యామ్నాయ పంటలైన పత్తి, మొక్కజొన్న, అపరాలు తదితర పంటల సాగు చేయాలని మండల వ్యవసాయ సహాయ సంచాలకులు కె.వి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రాజుపాలెం దేగరమూడి రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏఓ రామినేని లావణ్యతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పొగాకు నిల్వలు కలిగి ఉన్న రైతులు, అధికారులు షెడ్యూల్ ఇచ్చి మ్యాప్ చేసిన గోడౌన్‌కు మాత్రమే తరలించుకు వెళ్లాలని ఆయన తెలిపారు. ఏవో లావణ్య మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు వీఆర్వో దగ్గర తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి బి.హనుమంతు నాయక్ మాట్లాడుతూ మార్టూరు మండలంలో పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం హెక్టార్‌కు రూ.42,000 రూపాయలు రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రుతుపవనాల రాకకు ముందు రైతులు పిఎండిఎస్ కిట్లు వాడకం వలన కలిగే ప్రయోజనాల గురించి ప్రకృతి వ్యవసాయ మండల అధికారి రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రాధాకృష్ణ, వివిఎ దీక్షిత్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా ఉపకరణాలు వితరణ

విశాలాంధ్ర - సంతమాగులూరు : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు దాతృత్వం చాటారు. పత్తేపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా ఉపకరణాలు వితరణ చేశారు. సర్పంచ్ ఐనాల గోపీ ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు కొనుగోలు చేశారు.వీటిని సంతమాగులూరు ఎంఈవో-2 దార్ల దినేష్ కుమార్ చేతులు మీదుగా పిల్లలకు పంపిణీ చేశారు.ఈసందర్భంగా పాఠశాల తరపున సర్పంచికి కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో టీచర్ అమృతపూడి శేఖర్ బాబు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

శ్రీ ప్రతిభ విద్యార్థి యశ్వంత్ లాసెట్‌లో ప్రతిభ

విశాలాంధ్ర-ఒంగోలు : వలేటి వారిపాలెం మండలంలోని పోకూరు గ్రామానికి చెందిన సుంకె యశ్వంత్, శ్రీ ప్రతిభ జూనియర్ కాలేజీలో విద్యాభ్యాసం పొందుతూ, మరోసారి తన ప్రతిభను నిరూపించాడు. టీఎస్ లాసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 605వ ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన ఏపీ లాసెట్‌లో రాష్ట్ర ర్యాంక్ 133 రావడంతో పాటు, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో 1000 మార్కులకు 985 మార్కులు సాధించి అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధించాడు. శ్రీ ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతా రామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ యశ్వంత్‌ను అభినందిస్తూ, "నీ విజయాలను ఇక్కడే ఆపకుండా, గొప్ప న్యాయవాదిగా మరియు న్యాయమూర్తిగా ఎదగాలి" అని ఆశీర్వదించారు.

మిరపలో ఎండు తెగులు నివారణకు సూచనలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మిరపలో ఎండు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సంతమాగులూరు మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా రైతులకు సూచించారు. బుధవారం కుందుర్రు, పరిటాలవారిపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏవో సైదా మాట్లాడుతూ మిర్చి సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు అందరూ ముందుగా ఎకరానికి 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి తీసుకుని అందులో 20 కేజీల పశువుల ఎరువులను కలిపి వారం రోజుల పాటు కలిపి ఉంచాలని చెప్పారు. పొగాకు ప్రత్యామ్నాయ పంటలైన కంది, పత్తి, మొక్కజొన్న పంటలపై దృష్టి సారించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో మాధురి, రైతు సేవా కేంద్రం సిబ్బంది అఖిల్,వాసు,శివాజీ పాల్గొన్నారు.

బాపట్లలో ఎంపీడీవో కార్యాలయం నిర్మించాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుదే రాజారావు

విశాలాంధ్ర - బాపట్ల : గత ప్రభుత్వంలో కూల్చేసిన బాపట్ల మండలం ప్రజా పరిషత్ కార్యాలయాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి నిర్మించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుదే రాజారావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కూల్చేసిన భవనానికి వచ్చిన ఇనుము కలపసామాగ్రి లెక్కలు బహిరంగ పరచాలన్నారు.

అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం అందిస్తాం

ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర-సిఎస్ పురం : గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయి నష్టపరిహారం రానటువంటి అర్హులైన రైతులందరికీ న్యాయం జరిగేలా వారికి నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తానని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నష్టపరిహారం రానటువంటి వివిధ గ్రామాలకు చెందినటువంటి రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన రైతులు తమకు నష్టపరిహారం ఇవ్వకుండానే తమ పొలాల్లో రోడ్డు వేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు రికార్డులు సక్రమంగా ఉండి నష్టపరిహారం రాని రైతులందరికీ కూడా వారి రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు ముఖ్యంగా ముండ్లపాడు పరిధిలో కొంతమంది రైతులు తమ పేరు మీద పట్టా ఉన్నప్పటికీ ఆన్లైన్లో తమ పేరు తొలగించారని దీనివల్ల బ్యాంకు నందు లోన్లు రెన్యువల్ చేసుకోవడానికి ఇబ్బందికరంగా ఉందని అలాగే రైతు భరోసా డబ్బులు కూడా తమకు రావడంలేదని తెలిపారు వీటన్నిటినీ పరిశీలించి తగు న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు రికార్డులు సక్రమంగా లేకుండా పేర్లు లేనటువంటి రైతులకు త్వరలో ఏర్పాటు చేయబోయే అసైన్మెంట్ కమిటీలో పేర్లను చేర్పి మీ భూములు మీకే ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు ఎవరూ కూడా నష్టపరిహారం రాలేదని రోడ్డు నిర్మాణ పనులను ఆపవద్దని అర్హులందరికీ నష్టపరిహారం వచ్చే విధంగా తాను కృషి చేస్తానని రైతులకు సూచించారు అనంతరం గ్రామాల వారీగా వచ్చిన రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి తహసిల్దార్ హుస్సేన్ మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు సిఎస్పురం సర్పంచ్ శ్రీరాం పద్మావతి క్లస్టర్ ఇంచార్జి నాగిశెట్టి చిన్న మాలకొండయ్య మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు దాసరి మల్లికార్జున చెరుకుపల్లి వెంకట్ రెడ్డి రైతులు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పత్రిక రంగంలో 'కంచర్ల రామయ్య' విశిష్ట సేవలు

మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

విశాలాంధ్ర-కందుకూరు : కంచర్ల రామయ్య విలేకరిగా పత్రికా రంగంలో మంచి పేరు పొందారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఇటీవల మరణించిన ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్ట్ కంచర్ల రామయ్య చిత్ర పటానికి బుధవారం నాడు కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో మంత్రులు డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మ్యారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య పూల మాలలు వేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ కంచర్ల రామయ్య మృతి బాధాకరమన్నారు. రామయ్య ఈనాడు విలేకరిగా పత్రికా రంగంలో మంచి పేరు పొందారని, కందుకూరులో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి నెలకొల్పి ప్రకాశం జిల్లా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అతి తక్కువ ఫీజులకే ఇంజనీరింగ్ విద్యను అందించారని అన్నారు. రామయ్య వివిధ రంగాల ద్వారా అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రి కొనియాడారు.

ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలి

విశాలాంధ్ర-పొన్నలూరు : ఉపాధి కూలీలకు సంవత్సరానికి 100 నుండి 200 రోజులు పని దినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తేటిపేట గ్రామంలో ఉపాధి కూలీలు పని వద్దకు వెళ్లి వారి యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధి కూలీల వేతనాలు 15 రోజులు లోపల ఇవ్వాలని, ఆ తర్వాత వడ్డీతో కలిపి ఉపాధి కూలీ వేతనాలు ఇవ్వాలని చట్టం చెబుతున్న మాట అది విధంగా అధికారులు కూడా సహకరించి, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, పలుగు పాత తట్ట మెడికల్ కిట్టు టెంట్ ఇవ్వాలని ఆయన తెలిపారు, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, ఉపాధి కూలీలు ఐక్యంగా నిలబడి ఉపాధి పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధి హామీ కూలీల మీద ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ నిలుపుదల చేయాలి

సర్వేయర్ల నిరసన

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండల సచివాలయ సర్వేయర్లు సంబంధించి రేషనల్ హైజేషన్ నిలుపుదల చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న నిరసనలో భాగంగా బుధవారం తహశీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందచేసారు విజయవాడలో జరుగుతున్న రిలేనిరాహారదీక్షల్లో పాల్గొనేందుకు సెలవు కోరారు అదేవిధంగా ప్రమోషన్లు సీనియారిటీ ప్రకారం ఇవ్వాలని పెండింగ్‌లో ఉన్న టిఏ, డిఏ బిల్లులు ఇవ్వాలని కోరారు. నోషనల్ ఇక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అన్నిగ్రామాల సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

1 నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో రేషన్

విశాలాంధ్ర - రేపల్లె : జులై 1 నుండి లబ్దిదారులందరికి ముఖాదరిత హాజరు ద్వారా ఇంటికి రేషన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఒంగోలు రీజియన్ ప్రాంతీయ ఉప సంచాలకులు ఎస్.జయలక్ష్మి అన్నారు. బుధవారం రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఆమె సందర్శించి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధార్ తీసుకోనీ అంగన్వాడీ సెంటర్లకు వెళ్లి రేషన్ పొందవచ్చునన్నారు. అన్ని యాప్స్‌లో డేటాను ఎప్పటికప్పుడు అప్డేట్ చెయ్యాలని తెలియజేశారు. అంగన్వాడీ ఆయాలు కూడా ప్రిస్కూల్ ఆక్టివిటీస్‌లో పాల్గొనాలని తెలియజేశారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణకు సంబంధించి తగు సూచనలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రేపల్లె ప్రాజెక్టు సిడిపిఓఎం సుచిత్ర, సూపర్వైజర్లు సి. హెచ్. హిమబిందు, టి.రాధిక, విజయలక్ష్మి, మంజుల, నాగలక్ష్మి,ఎల్‌డిసి మణి శంకర్, బి.పిసిఅరుణడి. ఈఓలు పి.సుమన్ నిర్మలవేణి తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక లక్ష్యాల సాధనలో

చిత్తశుద్ధితో పనిచేయాలి

కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళిక లక్ష్యాల సాధనలో మండల స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు.బుధవారం స్థానిక కలెక్టరేట్లో వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 2025- 26 ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళికను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 శాతం వృద్ధి లక్ష్యసాధన దిశగా పి4 కుటుంబ సభ్యుల, స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాదులను మెరుగుపరిచే దిశలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా వివిధ శాఖలను సమన్వయం పరుచుకుంటూ లక్ష్యాలను నిర్దేశించటమైనదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పి4 కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అట్టడుగున ఉన్న నిరుపేద కుటుంబాలను, అభివృద్ధి పదంలో నడిపేందుకు ధనికులు, పేదలను దత్త తీసుకొని అభివృద్ధిలోకి తీసుకొచ్చే కార్యక్రమం అన్నారు. జిల్లాలో 62 వేల 3 వందల 68 మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేయడమైనదని తెలిపారు. మార్గదర్శకులుగా 3524 మంది ముందుకు వచ్చారని తెలిపారు. 44 వేల మంది బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు మ్యాపింగ్ చేయడమైనదని తెలిపారు. డిఆర్డిఏ ద్వారా పి4 కార్యక్రమంలో భాగంగా పవన్ అనే వ్యక్తికి 51 వేలు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. బంగారు కుటుంబాలకు అందించిన సహాయాన్ని పి4 పోర్టల్ లో నమోదు చేయాలని ఆయన తెలిపారు.పి.ఎం సూర్యఘర్ పథకం కింద స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ సదుపాయం కల్పించాలని ఆదిశగా ఎంపీడీవోలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్సీ ఆంజనేయులు, డిపిఓ ప్రభాకర్, ముఖ్య ప్రణాళిక అధికారి షాలేం రాజు, బాపట్ల డిఎల్డిఓ విజయలక్ష్మి, చీరాల డిఎల్డిఓ పద్మావతి పాల్గొన్నారు.

దేవరకొండ రత్తమ్మ హత్య కేసులో

రూ.8.25 లక్షల రిలీఫ్ మంజూరు

- చిన్న కూతురు దుర్గకు ప్రభుత్వ ఉద్యోగం
- పెద్ద కూతురు నాగమణికి ఎస్సీ ఎస్టీ స్పెషల్ మంత్లీ పెన్షన్
- పెన్షన్ ఉత్తర్వులు అందచేసిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు : చీమకుర్తికి చెందిన దేవరకొండ రత్తమ్మ అను ఎస్టి ఎరుకుల కులానికి చెందిన మహిళ హత్య కేసులో మూడేళ్ళ దళిత నేత నీలం నాగేంద్ర పోరాట ఫలితంగా బాధిత కుటుంబానికి 8.25 లక్షల రిలీఫ్ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయ మంజూరు చేసారు. అలాగే చిన్న కుమార్తె పాలపర్తి దుర్గకు ప్రభుత్వ ఉద్యోగం పెద్ద కుమార్తె పేరం నాగమణికి ఎస్సీ ఎస్టి స్పెషల్ మంత్లీ పెన్షన్ దళిత నేత నీలం నాగేంద్ర రావు సమక్షంలో జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో బాధిత మహిళలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, మరియు రవి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర - వేటపాలెం : 8 ఏళ్లు అత్యుత్తమగా పనిచేసి ఈ ఏడాది 596 మార్కులతో రాష్ట్రంలో తృతీయ స్థానం,బాపట్ల జిల్లా ప్రథమ స్థానం,13 ఐటి సీట్స్ సాధించి రాష్ట్రవ్యాప్తంగా పందిళ్లపల్లి హైస్కూల్కు ఒక బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చి,బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తిలను ఘనంగా విద్యార్థుల సమక్షంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పందిళ్ళపల్లి హైస్కూల్ పిల్లల తల్లిదండ్రులు చేనేత, వివిధ వృత్తులపై ఆధారపడి కష్టపడి జీవిస్తూ, పేదవారైనప్పటికీ, విద్య పట్ల ఆసక్తి కలిగి, తమ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని బాగా ప్రోత్సహిస్తారని తెలిసి ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా రావడం జరిగిందన్నారు. 2017-18 విద్యా సంవత్సరంలో ఆరుగురు 10/10 జిపిఏ సాధించడంలో, ఐదు త్రిబుల్ ఐటీ సీట్లు, గుత్తి పూజిత సీఏ, సీఎంఏ కోర్సు సెలెక్ట్ చేసుకొని, విజయవంతంగా పూర్తి చేసి, ప్రస్తుతం 36 లక్షల ప్యాకేజీతో సిద్ధంగా ఉందని, ప్రతి ఏడాది 5,6,7,10 త్రిబుల్ ఐటి సీట్స్ సాధించడం, 2022 -23 విద్యా సంవత్సరంలో 591 మార్కులతో దంతం విష్ణు ప్రియ బాపట్ల జిల్లా ప్రథమ స్థానం సాధించడంలో త్రిబుల్ ఐటీ హైదరాబాదులో సీటు సాధించడంలో ఈ సంవత్సరం పందిళ్ళపల్లి హైస్కూల్ విద్యార్థిని సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు సాధించారన్నారు. జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా నేను సెలెక్ట్ కావడంలో ప్రధాన భూమిక పోషించడంలో కృషిచేసిన ఉమ్మిటి వేణు గోపాలరావు, వివిఎల్ నరసింహం, మెడబలిమి శేఖరరావు, కటకం నారాయణ, గుంటూరు శివ శంకర్, నాగరాజు, వై రత్నం మాస్టారులను విజయవర్ధన్ రాజు, స్టెల్లా , సాయి సత్యనారాయణ, బుద్ధి మోహన్ రావు, లలిత పరమేశ్వరి, సిహెచ్ భవాని, బుద్ధి ప్రసన్నాంజనేయులు, చైతన్య, బత్తుల నీలిమ, పీడీలు కర్ణ నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు విద్యార్థులకు మంచి విద్య అందించడంలో, ఉత్తమ పౌరులుగా తయారు చేయడంలో కృషి చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ చెరుకూరి రాంబాబు, భారతి అభినందించారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్పై అవగాహన

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బుధవారం స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇటీవల కాలంలో చిన్నారులపై లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో చాలా సందర్భాలలో తెలిసిన వారినుంచే పిల్లలు ఇలాంటి వేధింపులను ఎదుర్కొంటున్న ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో పిల్లలకు శరీర అవయవాల గురించి అవగాహన కల్పించడం ద్వారా శరీరానికి సంబంధించి కొన్ని నియమాలు ఉంటాయని పిల్లలకు తెలియజేసి వాటిని ఇతరులు అతిక్రమిస్తున్నప్పుడు స్పందించడమే కాదు, తక్షణం వ్యతిరేకించడమెలాగో గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి చిన్నారులకు అర్థమయ్యేలా ఎస్సై అజయ్ బృందం అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో హై స్కూల్ ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని బతికిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

షర్మిల పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలోనే నాయ కులు కార్యకర్తలుతో వైఎస్ షర్మిల మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం విఫలమయిందని ఆమె అన్నారు. విభజన హామీలతో పాటు సూపర్ సిక్స్, ఎన్నికల హామీలను మరిచారని ఎద్దేవా చేశారు. గత 11 సంవత్సరాల నుండి బీజేపీ రాష్ట్రానికి వెన్నుపోటు పొడుస్తున్న చంద్రబాబు,జగన్ తొత్తులుగా మారి పొత్తులు పెట్టుకున్నారని జగన్ ది బిజెపితో చీకటి ఒప్పందం అని విమర్శించారు.ప్రజల కోసం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని,అందరం కలసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశంపార్టీ, వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ భారతీయ జనతా పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయన్నారు. విభజన హామీలు నెరవేరాలన్నా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ పార్టీకే సాధ్యం అన్నారు.భాజపా నియంతృత్వ పోకడలను ఎదుర్కొంటున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీకి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని షర్మిల అన్నారు. మాజీ శాసన సభ్యులు ఆమంచి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నియంతృత్వ పోకడలను వ్యతిరేకిస్తున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు.రాష్ట్రంలో వైకాపా,తెదేపా భారతీయ జనతా పార్టీతో అంట కాగుతూ ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్పు గ్రెగొరీ, బోనిగల పేతురు బాబు,దార్ల శాస్త్రి, విజయ్ కుమార్,వివిధ నియోజక వర్గాల నుండి వచ్చిన కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు నందు బుధవారం ఎంపీడీవో డి.సురేష్ బాబు అధ్యక్షతన మండల స్థాయి ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు ఉపాధి కూలీలు పని దినాలు కల్పించాలని అవగాహన కల్పించాలని. ఫారం పాండ్స్ పనులను కొనసాగించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలులలో ఉపాధి హామీ పనులను కొనసాగించాలన్నారు.

నాటు సారా రహిత జిల్లాగా బాపట్ల

(మొదటిపేజీ తరువాయి)

అభినందించారు. ఎన్ఫోర్స్మెంట్ దాడులు నిరంతర ప్రక్రియగా జరగాలన్నారు. గ్రామాలలో కమిటీలు బాగా పనిచేయాలని సూచించారు.నాటు సారా ఉత్పత్తి లేని జిల్లాగా బాపట్లను చేయడానికి అధికారులు ఎంతో కృషి చేశారని వివరించారు.క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన పలు సూచనలు చేశారు.నాటు సారా రహిత జిల్లాగా బాపట్లను చేయడమే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేశారని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ హేమంత్ నాగరాజు తెలిపారు.బాపట్ల, చీరాల,వేమూరు, రేపల్లె,నగరం మండలాలలో నాటు సారా ఉత్పత్తి గతంలో జరిగేదని చెప్పారు.నాటు సారా నియంత్రణకు సమగ్ర ప్రణాళికతో అధికారులు చేసిన కృషిని అభినందించారు. ఈ సమావేశంలో రహిత జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు,కమిటీలోని వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను చంపుతారా..?

(మొదటిపేజీ తరువాయి)

హాస్పిటల్కి తరలించేందుకు ఎవరిని పురమాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి జగన్ తన. పర్యటనలను కొనసాగిస్తున్నారు అన్నారు. ఇప్పటికైనా కార్యకర్తలు జగన్ తీరు పట్ల జాగ్రత్త వహించాలని హితోపలికారు.

2026 నాటికి వెలిగొండ పూర్తి

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యి ఉంటే, మరో 20 సంవత్సరాలు అయినా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాదన్నారు. చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కోసం అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. చాలా పనులు పూర్తిగా కాకుండానే మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయటం ఏంటని ఎద్దేవా చేశారు. పూర్తి చేసేది తెలుగుదేశం ప్రభుత్వమే అని పేర్కొన్నారు. సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్, దర్శి నియోజకవర్గ ఇన్ఛార్జి డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - కొండపి : కౌలు రైతులు కౌలు రైతుల గుర్తింపు కార్డు కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం మాల్యాద్రి తెలిపారు. కొండపి మండలం పరిధిలోని ఇళవర మరియు కట్టావారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి మాల్యాద్రి అధ్యక్షత వహించి కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2025కి సంబంధించి కౌలు రైతులు, కౌలు గుర్తింపు కార్డ్ కోసం రైతు సేవా కేంద్రం లో దరఖాస్తు చేసుకోవాల్సింది గా తెలియజేశారు. దీనికి సొంత రైతు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు మరియు కౌలు రైతు ఆధార్ కార్డు, పాస్ ఫోటో, నకళ్ళను రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి సమర్పించి తమ పేరు నమోదు నమోదు చేయించుకోవాల్సిందిగా తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో రైతుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి .కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు జి రమ్య మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ

విశాలాంధ్ర-ముండ్లమూరు : కౌలు రైతులకు కౌలు కార్డులు ఉన్నట్లయితే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు అన్నారు. మండలంలోని పూరి మెట్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమి లేని రైతులు భూ యజమానుల వద్ద నుండి భూమి కౌలుకు తీసుకున్నట్లు కౌలు పత్రం రాయించు కొన్నట్లయితే ప్రభుత్వం నుండే వచ్చే రాయితీ పథకాలకు అర్హులౌతారన్నారు. అర్హులైన కౌలు రైతులు వీఆర్వోను కలిసి కౌలు కార్డులు పొందాలన్నారు. కౌలు రైతులకు కూడా బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు త్యాగరాజ, తిప్పేస్వామి, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కే ప్రకాష్ రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెదారికట్ల చిన్నారి కట్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు అధీకృత లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని కొనుగోలు చేసిన తరువాత బిల్లులు తప్పకుండా తీసుకోవాలని అన్నారు. కౌలు రైతులు సిసి ఆర్ సికార్డులను విధిగా పొంది ఉండాలని ఆ కార్డులు ఉన్నవారికి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. పచ్చిరొట్ట చెరువులను 50 శాతం రాయితీపై అందజేయడం జరుగుతుందని కావలసిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీరామున్ రెడ్డి, ఏఈఓ రవికాంత్ పాల్గొన్నారు.

‘చలో తెనాలి’ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు : తెనాలి పోలీసుల అరాచకాన్ని మానవహక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ జూన్ 28న తెనాలిలో జరుగు మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని బుధవారం ఒంగోలులోనే మంచి పుస్తకం షాపు దగ్గర కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు మాట్లాడుతూ తెనాలిలో పోలీసులు రాజ్యాంగ హక్కులను చట్టాలను తుంగలో తొక్కి దళిత మైనార్టీ యువకులపై బహిరంగ ప్రదేశాల్లో లాటిలు విరిగేటట్లు అమానుషంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల పరిరక్షణను కాపాడుకోవాలని ఆయన అన్నారు. అధికార పార్టీ మంత్రులు దాడిని సమర్ధిస్తూ మాట్లాడటం హేయమైన చర్యని అన్నారు. సమర్ధించిన హోంమంత్రి ఎస్సీ సతీష్ కుమార్ తదితరులపై జాతీయ మానవ హక్కుల వేదిక స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇట్లాంటి చర్యలు పునరావతం కాకుండా ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని ఈనెల 28న చలో తెనాలి కార్యక్రమాన్ని అన్ని హక్కుల దళిత ప్రజాసంఘాల పిలుపును అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కె.పేరయ్య, ఎఐబిఎస్‌పి జిల్లా అధ్యక్షులు టి వెంకటస్వామి బిఎల్‌పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎం జార్జి ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి అధ్యక్షులు గాలి సంగీతరావు, ఆనాల వెంకట్రావు సర్పంచి ధనరాజు పల్లి ఆంజనేయులు డప్పు కళాకారుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు నరసింహారావు అంకయ్య ప్రజాస్వామిక వాదులు లింగ వెంకటేశ్వర్లు శేషారెడ్డి ప్రభాకర్ తన్నీరు వెంకటస్వామి రచయిత పిన్నికి శ్రీనివాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులు తీసుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చుక్కా విజయ రాజు అన్నారు.బుధవారం మండలంలోని కూచినపూడి,బొర్రావారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం కౌలుకు సాగు చేసే ప్రతి ఒక్క రైతు సొంత భూమి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కౌలు కార్డులు పొందవచ్చని చెప్పారు.పంట నష్ట పరిహారం అందాలన్నా,అన్న దాత సుఖీభవ పథకం డబ్బులు పడాలన్నా,పంట అమ్ముకోవాలన్నా కౌలు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు.అలాగే రైతు సేవా కేంద్రాల్లో కేజీకి రూ.5 చొప్పున సబ్సిడీ పైన వరి విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో భాగంగా కౌలు రైతులకు మంజూరైన కౌలు కార్డులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కూచినపూడి టీడీపీ నాయకులు నల్లపాటి ఎల్లయ్య,విఏఏలు,రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రసాయన రహిత సేద్యానికి రైతులు సిద్ధం కావాలి

విశాలాంధ్ర - అద్దంకి : రసాయన రహిత సేద్యానికి రైతులు సిద్ధం కావాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని మైలవరం ఉప్పలపాడు గ్రామాలలో ఏవో వెంకటకృష్ణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు,పురుగు మందులు వాడకం వలన పంటలలో రసాయన అవశేషాలు కలిగి ఉండడం వలన ఎగుమతి చేసిన ఉత్పత్తులు తిరస్కరించబడుతున్నాయని పంట నాణ్యత దిగుబడులపై కూడా ప్రభావం చూపుతున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించి భూమిలో కర్బన శాతం పెంపొందించడానికి పచ్చి రొట్టె పంటలు సాగు చేసి పూత దశలో భూమిలో కలియదనడం వలన భూసారం పెరుగుతుందన్నారు.ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారిని దీప్తి తెలిపారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రఫీ, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కొమ్ము కాలువ ఆక్రమణలు తొలగించాలి

పెరవలిపాలెం రైతుల డిమాండ్

విశాలాంధ్ర - వేమూరు : మండలంలోని పెరవలిపాలెం గ్రామంలో కొమ్ము కాలువ ఆక్రమణలకు గురై పూర్తిగా మూసుకు పోయే విధంగా చేశారని ఇందు వలన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే అధికారులు ఆక్రమణలు తొలగించి కాలువ మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి కాలువ పరిసరాలను రైతులు పరిశీలన చేశారు.కొమ్ము కాలువ ద్వారా రైతులకు పంట పొలాలకు సాగునీరు అందించటంతో పాటు దాదాపు 1600 ఎకరాలకు మురుగును గంగోలు డ్రైన్‌లోకి చేరవేస్తుందన్నారు.కాలువ పూడ్చి వేయడం ద్వారా ఈ 1600 ఎకరాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు పేర్కొన్నారు. తక్షణం రెవెన్యూ అధికారులు కాలువ సర్వేను నిర్వహించి ఆక్రమణలు తొలగించాలని సర్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు నీటి సంఘం అధ్యక్షులు చవ్వాకుల లీలా కృష్ణమూర్తి, రైతు నాయకులు కంచి సీతారామయ్య,దాసరి చిన్న, కంచి సాంబశివరావు తదితరులు రెవెన్యూ అధికారులతో రైతుల ఇబ్బందుల గురించి వివరించారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలం పుచ్చకాయలపల్లి సచివాలయంలో బుధవారం రోజు 10 గంటలు దాటిన కూడా సచివాలయం తలుపులు తెరుచుకోవడం లేదు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. మా ఇష్టమొచ్చిన టైమ్‌కి మేము వస్తామని కొంతమంది అధికారుల నిర్లక్ష్యం ఉద్యోగుల రాకకోసం జనం పడిగాపులు కాస్తున్నారు. గంటలకొద్దీ ఆలస్యంగా కార్యాలయాలకు తాపీగా వస్తూ విధి నిర్వహణలో మమ అనిపించుకుంటూ పోతున్నారు. వివిధ సేవల కోసం సచివా లయాలకు వెళ్తున్న ప్రజలకు తాళాలు కూడా తీయకుండా తలుపులు వేసి ఉండడం కనిపిస్తుంది. దీంతో ఉద్యోగుల రాక కోసం ప్రజలు సచివాలయాల వద్ద గంటలకొద్దీ పడిగాపులు కాయాల్సి వస్తుంది. పై అధికారులు చర్యలు తీసుకొని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సచివాలయం దగ్గరకి వచ్చిన కొందరు చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు కోరుతున్నారు.